క్లుప్తంగా

ఉద్యోగులకు పెనాల్టీలు వేయొద్దు



బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): బ్యాంకు రుణాలు తీసుకున్న ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఈఎంఐ విషయంలో ఒత్తిడి చేయొద్దని, పెనాల్టీలు వేయవద్దంటూ నంద్యాల జిల్లా ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షుడు రామచంద్రారావు కోరారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు గురువారం పట్టణంలోని ఎస్‌బీఐ రీజనల్ బ్రాంచ్, మెయిన్ బ్రాంచ్‌ల మేనేజర్లను ఉద్యోగులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. నాయకులు రాఘవేంద్రయ్య, కామేశ్వరరెడ్డి, నాగరాజు, సంజీవరావు, పవన్‌కుమార్‌రెడ్డి, మనోజ్‌కార్తీక్, సాయి, రాయుడు పాల్గొన్నారు.

జనన, మరణాలు నమోదు చేయాలి

ఉయ్యాలవాడ : అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో జనన, మరణాలను తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్‌డీజీ సర్వేపై అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అలాగే ప్రత్యేక ఆధార్ శిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సూపర్‌వైజర్ లక్ష్మిశైలజ, ఏఓ సత్యన్న, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 26వ వార్డుకు చెందిన షేక్ సలీమ్ (46) ఈనెల 15న గుండె జబ్బుతో మృతి చెందాడు. వార్డు కౌన్సిలర్ మేస చంద్రశేఖర్, సచివాలయ వెల్ఫేర్ మనోహర్, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్, ముర్తుజావలి, బొమ్మదాసు, వలంటీర్ సరోజిని గురువారం మృతుడి భార్య షేక్ మాబీకి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి యోగేశ్వరరెడ్డి

బొమ్మలసత్రం: అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కార్యాలయంలో అధికారులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారి భూపాల్‌రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రసాదరావు హాజరయ్యారు. జిల్లా ఫైర్ అధికారి జయన్న, జిల్లా సహాయ అధికారి యోగేశ్వరరెడ్డి, మెడికల్ ఆఫీసర్ లింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: అగ్నిప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆళ్లగడ్డ అగ్నిమాపక శాఖ అధికారి వీరారెడ్డి తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం స్థానిక కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఎంపీడీఓ సుబ్బారెడ్డి, పలు కళాశాలల విద్యార్థులు, పొదుపు సంఘాల లీడర్లు సందర్శించారు. ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టే చర్య లు, ఆపదలో ఉన్నవారిని రక్షించే విధానం, అధునాతన పరికరాలను ప్రదర్శించి వివరించారు.

అనధికార విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నంద్యాల(అర్బన్): పత్తి, మిరప విత్తనాలకు సంబంధించి అనధికారిక విత్తనాలను విక్రయించే డీలర్లపై సీడ్ యాక్టు ప్రకారం చర్యలు తప్పవని ఏడీఏ రాజశేఖర్, డీఏఓ కార్యాలయ టెక్నికల్ అసిస్టెంట్ రంగారెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో పత్తి, మిరప విత్తనాల విక్రయ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఏఓ స్వప్నికారెడి పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): రంజాన్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని నాల్గవ వార్డులో పేద ముస్లింలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బ్రహ్మానందీశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ చెంచుగారి వేణుగోపాల్ గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కోటవీధిలోని 300 మంది పేద ముస్లింలకు రంజాన్ కిట్లు అందజేశామని చెప్పారు.

జీవో రద్దు చేయాలి



ఎంపీ పోచాకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తెచ్చిన జీవో నంబర్ 52 రద్దు అయ్యేలా చూడాలంటూ ఆలిండియా బంజారా సేవా సంఘం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ నాయక్, నాయకులు శంకర్‌నాయక్, బాలునాయక్, బాలానాయక్, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

అత్తర్ పరిమళాల గుబాళింపు

- రంజాన్ మాసంలో వినియోగం అధికం
- ముస్లింలు తప్పనిసరి వాడటం ఆనవాయితీ
- నంద్యాలలో వివిధ రకాలు అందుబాటులో



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన అత్తర్‌లు

నంద్యాల(వ్యవసాయం): అత్తర్.. పది అడుగుల దూరం నుంచే ఆ పరిమళాల గుబాళింపు నాసికా పుటలను తాకుతుంది. ఆ సువాసన మనస్సును అపూర్వ పారవశ్యానికి గురిచేస్తుంది. ముస్లింల సంప్రదాయంలో అత్తర్‌కూ చోటుంది. రంజాన్ మాసంలో వీటి వాడకం అధికంగా ఉంటుంది. ఈ మాసంలో కొనుగోళ్లు పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. రంజాన్ మాసంలో అత్తర్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ముఖ్య పండుగలకు, పెళ్లిళ్ల సీజన్లలో అత్తర్‌కు గిరాకీ ఎక్కువగా ఉన్నా.. రంజాన్ మాసంలో మాత్రం వివిధ రకాల అత్తర్‌లకు డిమాండ్ అధికంగా ఉంటుంది. ముస్లింలలో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ అత్తర్‌ను వాడుతారు. నంద్యాల పట్టణంలో దాదాపు పది దుకాణాల్లో అత్తర్‌లను 3 ఎంఎల్ నుంచి 100 ఎంఎల్ వరకు లభ్యమవుతున్నాయి. 3ఎంఎల్ అత్తర్ సీసా రూ.50 నుంచి రూ.150 వరకు ఉంటుంది. మంచి సువాసన, నాణ్యమైనది కావాలంటే ఆర్డర్ల ప్రకారం ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, హైదరాబాద్ నుంచి తెప్పిస్తారు. వీటి ధర రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ధర ఉంటుంది. పాత పట్టణంలోని బైర్మల్‌వీధిలో అత్తర్ షాపులు ప్రస్తుతం కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి.

తయారీ ప్రాంతాలు..

ఉత్తరప్రదేశ్‌లో కన్నోజ్ ప్రాంతంలో అత్తర్‌లను ఎక్కువగా తయారు చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు అసోం, మహారాష్ట్ర, ఢిల్లీ, కలకత్తా, కాంబోడియాలో వీటి తయారీ కేంద్రాలు ఉన్నాయి. అత్తర్‌ను ఎంత ఎక్కువ కాలం భద్రపరిస్తే అంత సువాసన వెదజల్లుతుంది. నకిలీదైతే కొంత కాలంలోనే వాసనలో వ్యత్యాసం తెలుస్తుంది. స్వచ్ఛమైన అత్తర్ ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంటుంది.

అత్తర్ రకాలు..

మజ్ము, షాజాహాన్, తమ్మన్న, మొకలత్, ఖష్, ఇత్రేగిల్, షమామతుల్, అంబర్, హీనా, జఫ్రాన్, జన్నతుస్, ఫిరదోస్, నాయక్, హోప్, బకూర్, దహనన్ ఊద్ తదితర రకాలు ఉన్నాయి. కృత్రిమంగా తయారు చేసేవి రాసుకున్న మరుక్షణమే వాసన పోయే రకాలు ఉంటాయి. అసలు అత్తర్ అంటే రెండు మూడు సార్లు దుస్తులు ఉతికినా వాసన అలాగే ఉంటుంది.

అత్తర్ తయారీ విధానం..

గులాబీ రేకులు, మల్లెపూలు, మొగలిపువ్వులు, గంధం చెక్కలు ఏ అత్తర్ కావాలో ప్రత్యేకంగా తయారు చేసిన బట్టీల్లోనే పెద్ద డేగిశాల్లో వేస్తారు. డేగిశా పైన మూతకు ఒక చిన్న మార్గం ద్వారా ఆవిరి బయటకు వచ్చేలా రంధ్రం చేస్తారు. ఆ ఆవిరినే అత్తర్‌గా వాడుతారు. ఇదిలా ఉండగా..అత్తర్ తయారీలో పువ్వులు, గంధపు చెక్కలు, ప్రకృతి సిద్ధనమైన పదార్థాలను మాత్రమే వినియోగిస్తారు. కానీ.. పర్ఫ్యూమ్ తయారీలో ఆల్కహాల్ వాడతారు. ఇది మత్తును కలిగిస్తుంది. ఆల్కహాల్ ఇస్లామ్‌కు వ్యతిరేకం కావున పూర్తి స్వచ్ఛమైన అత్తర్‌ను వాడతారు.

కాలాలను బట్టి వాడకం..

అన్ని రకాల అత్తర్లను అన్ని సమయాల్లో వాడలేం. వాడే పద్ధతి తెలియక సమయం కాని సమయంలో ఒంటికి పూస్తే, వాసనను పీలిస్తే అనర్థనాలు కలిగే అవకాశం ఉంది. వేసవి కాలంలో ఖష్, ఇత్రేగిల్ చాలా మంచిది. ఇవి రెండు శరీరానికి చల్లదనాన్ని ఇస్తాయి. ఇత్రేగిల్ మట్టి వాసనను ఇస్తూ చల్లదనాన్ని కల్పిస్తుంది. వర్షాకాలం, చలికాలంలో షమామతుల్ అంబర్, హీనా, జఫ్రాన్, దహనల్ ఊద్ వంటివి వాడాలి. ఇవి శరీరానికి వెచ్చదనాన్ని ఇస్తాయి. వేసవి కాలంలో దహనల్ ఊద్ వాడితే శరీరంలో ఉష్ణోగ్రత పెరిగిపోయి ముక్కు నుంచి రక్తం కారుతుంది.

గిరాకీ బాగుంది



పట్టణంలో 70 సంవత్సరాల నుంచి మా పూర్వీకులు అత్తర్ వ్యాపారం చేస్తున్నాం. గత రెండు సంవత్సరాల నుంచి కరోనా కారణంగా వ్యాపారం లేక ఇబ్బంది పడ్డాం. ఈ ఏడాది రంజాన్ మాసంలో కరోనా లేకపోవడంతో అత్తర్ వ్యాపారం ఊపందుకుంది. కొత్త రకాల అత్తర్‌లను ఇతర రాష్ట్రాల నుంచే కాక దేశాల నుంచి కూడా ఆర్డర్లపై తెప్పిస్తాం. అత్తర్‌ల వాడకాన్ని ముస్లింలు ఎక్కువగా ఇష్టపడతారు. – **ఖాజాహుసేన్, అత్తర్ వ్యాపారి, బైర్మల్‌వీధి, నంద్యాల**

మిషన్ వాత్సల్యకు 398 దరఖాస్తులు

శిరివెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త పథకం మిషన్ వాత్సల్యకు మండలంలో 398 దరఖాస్తులు అందాయని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ దస్తగిరమ్మ గురువారం తెలిపారు. తల్లిదండ్రులు లేనివారు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారు, కరోనాలో తల్లి, తండ్రిని పోగొట్టుకున్న వారు, హెచ్‌ఐవీతో మరణించిన వారి పిల్లలు, హాస్టల్‌లో ఉంటూ చదుతున్న వారు, 18 సంవత్సరాలు దాటి ఇంటి వద్ద నుంచి పాఠశాలలకు వెళ్తున్న వారు మాత్రమే అర్హులని చెప్పారు. ఎంపికైన వారికి నెలకు రూ.4 వేలు అందజేస్తారని,దరఖాస్తులను పీడీ కార్యాలయానికి అందజేస్తామని వివరించారు.

భూసార పరీక్షలకు ఇదే అనువైన సమయం

దొర్నిపాడు: రబీ సీజన్ ముగిసిందని, ప్రతి రైతు ఖరీఫ్ సాగుకు ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని రామచంద్రాపురం, చారరాజువేముల గ్రామాల్లో మట్టి పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. నేలలో సారం లేనప్పుడు నాణ్యమైన విత్తనం వేసినా, అధిక పెట్టుబడులు వెచ్చించినా ఫలితం ఉండదన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగుచేస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. ఎకరా పొలంలో 10 నుంచి 15 ప్రదేశాల్లో మట్టి నమూనాలను సేకరించినప్పుడే ఖచ్చితమైన ఫలితం వస్తుందన్నారు. దొర్నిపాడు సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, వీఏఏలు సుప్రజ, ప్రవీణ్‌రెడ్డి, వంశీకృష్ణ, రంగారెడ్డి, రాణి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయండి



జేసీ, ఎస్పీతో మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్

నంద్యాల(అర్బన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పట్టణ ప్రధాన కూడలిలో ఏర్పాటయ్యేలా చూడాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ సూచించారు. గురువారం బండి ఆత్మకూరు మండలం బి.కోడూరు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తూ స్థానిక అతిథి గృహానికి చేరుకోగా.. నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఆర్‌డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి చింతామణి మర్యాదపూర్వకంగా కలిశారు. విక్టర్‌ప్రసాద్ మాట్లాడుతూ విగ్రహం ఏర్పాటుకు అధికారులందరూ కృషి చేయాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాసులు, దత్తు, నాగేంద్ర, శామియేల్, శీను, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు బాయికాటి ప్రహ్లాద్, మహేశ్వరమ్మ పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి..

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చితే గిరిజనులు నష్టపోయే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను గిరిజన ప్రజాసమాఖ్య నాయకులు కోరారు. గురువారం నంద్యాలకు వచ్చిన ఆయనను సమాఖ్య నాయకులు రాజునాయక్, రవినాయక్, విక్రమ్‌నాయక్ కలిసి విన్నవించారు.

విషప్రచారానికి చెంపపెట్టుగా 'జగనన్నే మా భవిష్యత్తు'



యాదవాడలో తన ఇంటికి 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ అతికించుకుంటున్న మహిళ

ఆళ్లగడ్డ: ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా, టీడీపీ సోషల్ మీడియా విషప్రచారాలకు చెంపపెట్టుగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం జరుగుతుందని సర్పంచ్ సరస్వతి, సచివాలయ కన్వీనర్ నరసింహారెడ్డి అన్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యాక్రమంలో భాగంగా రూరల్ మండలం యాదవాడలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాల గురించి వివరించి, టీడీపీ పాలనలో పథకాలు పొందడానికి పడిన ఇబ్బందులను, జగనన్న పాలనతో పోల్చి వివరించారు. వైఎస్సార్‌సీపీ పాలనపై అభిప్రాయాలు సేకరించారు. జగనన్న మీకు మేలు చేశారని సంతృప్తి చెందితే ఇంటికి స్టిక్కరు అతించుకోవాలని కోరడంతో జగనన్న పోటోతో ఉన్న స్టిక్కర్ గృహ యజమానులే అతికించుకోవడం విశేషం . గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

డీపీఓ కార్యాలయం తనిఖీ



రికార్డులు తనిఖీచేస్తున్న అడిషనల్ ఎస్పీ రమణ

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు అడ్మిస్ట్రేషన్ కార్యాలయాన్ని అడిషనల్ ఎస్పీ రమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులు పరిశీలించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారా లేదా అని ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను పరిశీలించారు.

కేసీ ద్వారా 1.37 లక్షల ఎకరాలకు సాగునీరు



మాట్లాడుతున్న ఈఈ తిరుమలేశ్వరరెడ్డి

నంద్యాల(అర్బన్): రబీలో కేసీ కెనాల్ ద్వారా 1.37 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని కేసీ కెనాల్ ఈఈ తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల్లో కేసీ కెనాల్‌కు సంబంధించి 90,500ఎకరాల ఆయకట్టు ఉండగా ఈనెల 15వరకు 1.37లక్షల ఎకరాలకు సాగునీరు అందించి పంటల సాగుకు తోడ్పాటునిచ్చామన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరి దిగుబడులు, ధరలు ఆశాజనకంగా ఉండటంతో రబీలో సైతం వరి సాగైందన్నారు. ఇప్పటికే తాగునీటి కుంటలను సైతం నింపామని, దాదాపు 0.78 టీఎంసీలు సుంకుసుల బ్యారేజీలో తాగునీటి అవసరాల నిమిత్తం నిల్వ ఉంచామ న్నారు. ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు అలగనూరు ఫీడర్ చానెల్ ద్వారా కుందూ నదికి నీటిని వదిలామని చెప్పారు.

పదోన్నతి కల్పించాలి

నంద్యాల(రూరల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న గ్రేడ్-2 విలేజ్ రెవెన్యూ అధికారులను గ్రేడ్-1గా పదోన్నతి కల్పించాలని జిల్లా సచివాలయాల వీఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కామేశ్వరరావుకు సంఘం నాయకులతో కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. నవీన్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ విభాగంలో నాలుగేళ్లుగా తక్కువ వేతనంతో సచివాలయ వీఆర్‌ఓలు పని చేస్తున్నారని, వారి సేవలను ప్రభుత్వం గుర్తించి గ్రేడ్-1గా పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా గ్రేడ్-2 వీఆర్‌ఓల సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సల్మాన్, అమర్, అబ్దుల్లా, రామాంజనేయులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గురువారం కలిశారు. వారు మాట్లాడుతూ తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో గురువారం సీఎంను కలిసి నియోజవర్గ అభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలిపారు. వీరి వెంట విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు.

రీ సర్వేతో రైతులకు ప్రయోజనం



పీపీ నాగిరెడ్డి ఆధ్వర్యంలో సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గోస్పాడు: జగనన్న భూహక్కు–భూరక్ష పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరమని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తెలిపారు. మండలంలోని కానాలపల్లె గ్రామంలో గురువారం సర్వే హద్దుల రాళ్లను ఏర్పాటు చేసే కార్యక్రమం తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ రైతులకు భూ సమస్యలు లేకుండా ప్రయోజనం కల్పించాలనే ప్రభుత్వం పథకాన్ని అమలు చేస్తుంన్నారు. పొలాన్నింటినీ కొలతలు వేసి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తుండటంతో భూ సమస్యలు తలెత్తే అవకాశం లేదని చెప్పారు. ఎల్‌పీఎం ప్రకారం 899 మంది రైతులకు ఇప్పటికే భూ హక్కు పత్రాలను పంపిణీ చేశామన్నారు. నాయకులు శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి డిప్యూటీ తహసీల్దార్లు రామచంద్రారావు, శేఖర్, సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓ గోపాల్బ పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి



మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి పలికి ప్రశాంతంగా జీవించాలని డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సూచించారు. గురువారం రాత్రి చాగలమర్రి మండలంలోని ఓజీ తండాలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దొంగలు బాబోయ్..

- మండలంలో పెరుగుతున్న చోరీలు, దారి దోపిడీలు



పందిర్లపల్లెలో ఇంటి కిటికీ ఇటుకలు తొలగించడాన్ని చూపుతున్న బాధితుడు

రుద్రవరం: మండలంలో దొంగతనాలు, దారి దోపిడీలు అధికమవుతున్నాయి. గుర్తు తెలియని దుండగులు మాస్కులు ధరించి రాత్రి సమయాల్లో వాహనాలపై వెళ్తున్న వారిపై రాళ్లతో దాడి చేయడం , కత్తులతో బెదిరించి నగదు, బంగారు, వెండి ఆభరణాలను లాక్కొని పంపిస్తున్నారు. ఇప్పటికే పలు సంఘటనలు చోటు చేసుకోవడంతో మండల వాసుల్లో దొంగల భయం పట్టుకుంది. మండల కేంద్రంతో పాటు చిత్రేనిపల్లె వైపు పంట పొలాల్లోని 70 వ్యవసాయ బోరు మోటార్ల వద్ద ఉన్న కేబుల్ తీగలను దొంగిలించారు. అలాగే పెద్దకంబలూరుకు మెట్ట, పెద్దకంబలూరు–ఎల్లావత్తుల మధ్య, పేరూరు–చిన్నకంబలూరు మెట్ట మధ్య మోటార్ సైకిళ్లపై వెళ్తున్న వారిపై రాళ్లు, కత్తులతో దాడి చేసి సొమ్ము కాజేశారు. ఈనెల 17వ తేదీన పందిర్లపల్లెలో బ్రహ్మయ్యకు చెందిన ఇంటికి కన్నం వేసి లోపలికి చొరబడి ఇంట్లో ఉన్న వ్యవసాయ పనిముట్లను అపహరించుకెళ్లారు. పంట పొలాల్లో పురుగు మందు పిచికారీ చేసే రూ.22వేల పవర్ స్ప్రేయర్,టిల్లర్‌కు సంబంధించిన సామగ్రి, ఇంటికి సంబంధించిన విద్యుత్ సామగ్రిని ఇంటికి వెనుక వైపు ఉన్న మరో కిటికీ కన్నం ద్వారా తరలించారు. వాటితో పాటు ఆ ఇంటికి పక్కనే నూతనంగా నిర్మితమవుతున్న ప్రభుత్వ గోదాములో 30 బస్తాల సిమెంటును ఎత్తుకెళ్లారు. దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు దొంగలను పట్టుకోలేకపోవడం, కనీసం చర్యలు కరువవడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పందిర్లపల్లె బాధితుడు బ్రహ్మయ్య తెలిపిన వివరాల మేరకు.. కొద్ది రోజుల్లో తన పెళ్లి ఉందని అందుకు పాత ఇంటికి కొద్ది దూరంలో కొత్త ఇంటి వద్ద పనులు సాగుతున్నాయి. ఆ ఇంటి పనికి సంబంధంచి విద్యుత్ సామగ్రి తెచ్చి ఉంచాం, అలాగే పొలానికి సంబంధించిన సామగ్రి ఉందని, రాత్రి ఇంటికి తాళం వేసి కొత్త ఇంటికి వెళ్లి ఉదయం పాత ఇంటి వద్దకు వెళ్లే సరికి తులపు పక్కన కిటికీకి కన్నం వేసి ఉండటాన్ని చూసి తాళం తీసి లోపలికెళ్లి చూడగా సామగ్రి లేకపోవడాన్ని గమనించి లబోదిబోమంటూ 100కు డయల్ చేశాడు. కాగా రుద్రవరం పోలీసులు మరసటి రోజు వచ్చి పరిసరాలను పరిశీలించి వెళ్లారు.



అమ్మిరెడ్డినగరంలో వరి పొలంలో గుంపులు గుంపులుగా కొంగలు.

కొంగల వేట..

దొర్నిపాడు: మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో కొంగలు వరి పొలాల్లో ఆహారం కోసం వేట సాగిస్తున్నాయి. కోతల సమయంలో కొంగలు అధికంగా వస్తుంటాయి. ఎండలు అధికంగా ఉండటం, నీటి వనరులు అడుగంటడంతో చేపలు కరువవడంతో పొలాల బాట పట్టాయి. పంటలను ఆశించే చీడపీడలను తింటూ కడుపు నింపుకుంటున్నాయి. ప్రస్తుతం కొంగలకు సంతానోత్పత్తి సమయం కావడంతో అధిక ఆహారం అవసరం అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. వరి కోతల సమయంలో పురుగులు నేల రాలడంతో వాటిని కొంగలు ఆరగిస్తున్నాయి. గుంపులు గుంపులుగా పొలాల్లో వాలుతుండటం, కోతల మిషన్ల వెంట పురుగుల కోసం నడుస్తుండటం చూపరులను ఆకట్టుకుంటోంది.

వేసవిలో పశువుల యాజమాన్యం



పశువులు, (ఇన్‌సెట్) పశు వైద్యాధికారి దస్తగిరి

శిరివెళ్ల: ఎండలు మండుతుండటంతో మనుషులతో పాటు పశువులు కూడా ఇబ్బంది పడుతున్నాయి. ఎండ వేడిమిని తాళలేకపోతున్నాయి. వేసవిలో పశువుల పోషణలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పశు వైద్యాధికారి దస్తగిరి పలు సూచనలు చేశారు.

- అధిక ఉష్ణోగ్రత్తలు పశువుల ఉత్పత్తి, పునరుత్పత్తిపై ప్రభావం చూపుతుంది.
- వడదెబ్బ, వేడి గాలుల నుంచి పశువులను రక్షించుకోవటానికి చర్యలు తీసుకోవాలి. చల్లటి సమయం అంటే.. ఉదయం 6 నుంచి 10 గంటలు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పశువులను పొలాల్లోకి మేతకు తీసుకెళ్లాలి.
- ఒకవేళ మధ్యాహ్నం కూడా పొలాల్లో ఉండవలసి వస్తే చెట్ల కింద ఉంచాలి. సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత చల్లని నీటితో పశువులను కడగాలి.
- పశువులకు ఎక్కువగా తాగునీటిని అందుబాటులో ఉంచాలి. పశువుల పాక చుట్టు గోనె సంచులను వేలాడి దీసి పగటి పూట 3 నుంచి 4 సార్లు నీటితో సంచులను తడపాలి.
- పశువుల షెడ్లపై వీలైతే స్పింక్లర్లను ఏర్పాటు చేసుకోవాలి. పాకల చుట్టూ చల్లటి గాలినిచ్చే చెట్లను పెంచుకుంటే మంచిది. వేడి గాలి నుంచి రక్షణ పొందవచ్చు.
- పాకలు, షెడ్లలోని వేడి గాలి బయటకు పోవడానికి ఎగ్జాస్టింగ్ ఫ్యాన్లను ఏర్పాటు చేసుకోవాలి.
- పొలాల్లోని కుంటల్లో పశువులు నీరు అధికంగా తాగేలా చూసుకోవాలి.

పశువులలో వడ దెబ్బ లక్షణాలు..

- జ్వరం 103 నుంచి 108 డిగ్రీలు ఉంటుంది. శ్వాసక్రియ అధికంగా ఉంటుంది.
- మేత, నీరు తీసుకోవడం తగ్గుతుంది. ఒకవేళ తీసుకున్నా జీర్ణం కాకపోవడం.
- మూత్రం, పేడ పసుపు పచ్చ లేదా ఎరుపు రంగులో ఉంటుంది. పేడ గట్టిగా, తేమ తక్కువగా ఉంటుంది.
- అస్వస్థత అధికమైతే పశువు అపస్మారక స్థితిలోకి వెళ్తుంది. పాల ఉత్పత్తి తగ్గిపోతుంది.

చికిత్స..

- వడ దెబ్బకు గురైతెన పశువుకు స్వచ్ఛమైన నీటిని, గ్లూకోజ్ లేదా బెల్లం కల్పిన నీటిని అధిక మొత్తంలో తాపించాలి. పశువైద్యాధికారిని సంప్రదించి చికిత్స చేయించాలి.
- ముఖ్యంగా ఎండలో మేతకు తీసుకెళ్లకపోవడం ఉత్తమం.

ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో పథకాలు అందాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జేసీ, ఇతర అధికారులు

నంద్యాల: సంక్షేమ పథకాలు ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో అందించేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రీసర్వే, జాతీయ రహదారుల కోసం భూ సేకరణ, హౌసింగ్, రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ రంగాలు, పీఆర్ అండ్ ఆర్‌డీ, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు అందేలా, సచివాలయ బిల్డింగ్‌లు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన గ్రీవెన్స్‌తో పాటు పథకాలు ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో అమలు చేయాలని చెప్పారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో ప్రజల అసంతృప్తికి గల కారణాలను అన్వేషించి సరైన రీతిలో పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కామేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.